పత్తికి పచ్చ పురుగు బెడద

- పట్టించుకోని వ్యవసాయాధికారులు
- ఆందోళనలో అన్నదాతలు

పెద్దవడుగూరు: పత్తి పంటలో పచ్చపురుగు విజృంభిస్తోంది. వ్యవసాయాధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా సుమారు 8,374 హెక్టార్లల్లో పత్తి సాగు చేశారు. అయితే నెల రోజులుగా వర్షాలతో పాటు ఈదురు గాలులు, వాతావరణం మేఘావృతం కావడంతో పత్తిను పచ్చ పురుగు, పచ్చదోమ , జీడ పురుగులు పెద్దఎత్తున ఆశిస్తున్నాయి. పలు రసాయన మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతోందని అన్నదాతలు వాపోతున్నారు. చింతలచెరువు, మిడుతూరు, చిత్రచేడు గ్రామాల్లో కొందరు రైతులు ఏకంగా పంటలను తొలగించడానికి ప్రయత్నిస్తున్నారు. పంటలు సాగు చేసినప్పటి నుంచి మండలంలోని వ్యవసాయ శాఖ అధికారులు పంట పొలాలను సందర్శించిన దాఖలాలు లేవు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలను అమలు చేయడం కోసం అలా వెళ్లి.. ఇలా తిరిగి వస్తున్నారనే వాదనలు గట్టిగా వినిపిస్తున్నాయి. నాసి రకం విత్తనాల వల్లే పురుగు ఉధృతి అధికమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఫర్టిలైజర్ షాపుల యజమానులను నమ్మి వారు ఇచ్చిన విత్తనాలు నాటుకుని , వారు ఇచ్చిన మందులను పిచికారీ చేస్తున్నారు. అయినా పురుగు ఉధృతి తగ్గడం లేదు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు పొలాల్లో పర్యటించి తమకు సలహాలు, సూచనలు ఇస్తే పంటలను కాపాడుకోవడానికి అవకాశాలు ఉన్నాయని రైతులు కోరుతున్నారు.



పెద్దవడుగూరు సమీపంలో సాగు చేసిన పత్తి పంట



పచ్చ పురుగు దెబ్బకు రంధ్రాలు పడిన ఆకులు

పత్తి పంట తొలగించా



రెండు నెలల క్రితం సాగు చేసిన పత్తి పంటలో పురుగు ఉధృతి అధికంగా ఉంది. దీంతో చేసేది లేక పంటలను తొలగించుకునే పరిస్థితి దాపురించింది. నాలుగు ఎకరాల్లో పంటను తొలగించాం. సుమారు రూ.రెండు లక్షల దాకా నష్టం వాటిల్లింది.

– సాంబశివుడు, రైతు, చింతలచెరువు

సలహాలిచ్చే వారేరీ?



వ్యవసాయాధికారులు గ్రామాల వైపు రావడం లేదు. రైతులకు సలహాలు , సూచనలు ఇవ్వడం లేదు. అన్నదాతల కష్టాలను గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. ఫర్టిలైజర్ షాపుల యజమానులిచ్చిన మందులను వాడుతున్నా ఫలితం లేదు.

– రామచంద్రారెడ్డి, రైతు, చింతలచెరువు

సూచనలు ఇస్తున్నాం



ప్రస్తుతం ఈ క్రాప్ నమోదు జరుగుతోంది. గ్రామాల్లో పర్యటించి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం. రైతులకు సబ్సిడీతో రసాయన మందు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందుబాటులోకి రాగానే అన్నదాతలకు మందులు పంపిణీ చేస్తాం.

– మునికృష్ణ, ఏఓ, పెద్దవడుగూరు

తూనికల అధికారులపై చర్యలు తీసుకోండి

గుంతకల్లు: తూనికలు, కొలతల అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణ కార్యదర్శి మారుతీ ప్రసాద్, నాయకులు సాకే నాగరాజు, జగ్గలి రమేష్, రాము నాయక్, సూరి, బాషా, తిమప్ప, శ్రీనాథ్ తదితరుల బృందం పట్టణంలోని పెట్రోల్ బంక్‌లో జరుగుతున్న కొలతల్లో అవకతవకలపై శనివారం ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ నాగభూషణంకు వినతి పత్రం చేశారు. మారుతీ ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలోని హనుమస్ సర్కిల్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో ఒక లీటరు పెట్రోల్ వేయించుకుంటే కేవలం 600 మిల్లీ లీటర్ల వేశారని కొందరు యువకులు గత శుక్రవారం యాజమాన్యంతో గొడవకు దిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలా పట్టణంలోని పలు పెట్రోల్ బంకుల వద్ద వాహనాదారులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తూనికలు, కొలతల అధికారులు పెట్రోల్ బంక్‌ల వైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక వీరి మధ్య అవినీతి ఒప్పందమేన్నారు. పెట్రోల్ బంకుల యాజమాన్యం అవినీతిపై చర్యలు తీసుకోవడంతోపాటు తూనికల కొలతల అధికారులు రెగ్యులర్‌గా తనిఖీ చేసేలా చూడాలన్నారు.



ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అధిక లోడు... మితిమీరిన వేగం



సజ్జలదిన్నె సమీపంలో రోడ్డుపై బోల్తా పడిన నాపరాళ్ల బండల ట్రాక్టర్

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- నడిరోడ్డుపై నాపరాళ్ల బండల ట్రాక్టర్ బోల్తా

తాడిపత్రిటౌన్: అధికలోడు.. మితిమీరిన వేగంతో తరచూ నాపరాయి బండల ట్రాక్టర్లు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. తాడిపత్రి ప్రాంతంలో బండల ట్రాక్టర్ వస్తోందంటే చాలు ప్రజలు, వాహనదారులు వణికిపోవాల్సిన దుస్థితి. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం నుంచి తాడిపత్రి బండల పాలిస్ ఫ్యాక్టరీలకు నాపరాళ్ల బండలతో నిత్యం వందలాది ట్రాక్టర్లు వస్తుంటాయి. అయితే అధికలోడు..విపరీతమైన వేగంతో వస్తుండటంతో ప్రజలు బంబేలెత్తుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు చర్యలు తీసుకోక పోవడంతో ట్రాక్టర్ డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. శనివారం తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె సమీపంలో ట్రాక్టర్ అధికలోడు.. మితిమీరిన వేగం కారణంగా అదుపుతప్పి డివైడర్‌ను ఎక్కి బోల్తా పడిన సంఘన చోటు చేసుకుంది. అయితే జన సంచారం లేని కారణంగా ఎలాంటి ప్రమాదం చోటు చేసుకొలేదు. ఇప్పటికైనా అధికారులు ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో శింగనమల నేతలకు చోటు

శింగనమల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శింగనమల నియోజకవర్గానికి చెందిన నేతలకు రాష్ట్ర కమిటీలో నియమించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా అంకె చిన్న ముసలన్న, ఎస్.ప్రతాప్‌రెడ్డి నియామకం అయ్యారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు



ప్రార్థనల్లో పాల్గొన్న రమేష్‌రెడ్డి

తాడిపత్రి రూరల్: పట్టణంలో జరిగిన గ్యార్మీ పండుగ వేడుకల్లో శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు. మత పెద్దలతో కలిసి ప్రార్థన చేశారు. గ్యార్మీకి హాజరైన వారితో మాట్లాడి స్వయంగా భోజనాలను వడ్డించారు.

ఉపాధి పనుల కోసం గ్రామసభలు

పుట్లూరు: మండలంలో ఉపాధి హామీ పథకం కింద 2026–2027లో చేపట్టాల్సిన పనుల గుర్తింపు కోసం శనివారం గ్రామసభలు నిర్వహించినట్లు ఏపీఓ తులసీప్రసాద్ తెలిపారు. గాండ్లపాడు, కొండేపల్లి, చాలవేముల, కోమటికుంట్ల, చెర్లోపల్లి, దోశలేడు గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి పనుల ఎంపిక కోసం ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించామన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వార్డు సచివాలయాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని రెండు వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలు, సచివాలయ ఉద్యోగుల పని తీరుపై ఆరా తీశారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని లచ్చానుపల్లికి చెందిన రామాంజనేయులు అనే వృద్ధుడు శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామాంజనేయులు గత కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో పాటుగా కుటుంబ సమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జలధికి తరలిన దుర్గమ్మ



దుర్గమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా 11రోజులు పూజలందుకున్న దుర్గామాతను శనివారం మండలంలోని శింగనగుట్టపల్లిలో జలధికి తరలించి నిమజ్జనం చేశారు. ఏటా దసరా పండగ సందర్భంగా గ్రామస్తులు ఐకమత్యంతో అమ్మవారికి బోనాలు, కలశాలను సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం ఇక్కడ ఆనవాయితీ. శనివారం సాయంత్రం దుర్గామాతను గ్రామంలో ఊరేగించి సమీపంలోని పెన్నానదిలో నిమజ్జనం చేశారు. వేడుకను తిలకించడానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ బందోబస్తు చేపట్టారు.

బైక్ మెకానిక్‌కు ఆర్థిక సాయం

గుత్తి రూరల్: మండలంలోని పి.ఎర్రగుడి గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ హరికృష్ణకు నవ్యాంధ్ర టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఆర్థిక సాయం, నిత్యావసరాలను అందజేశారు. గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ హరికృష్ణ కొన్ని నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో కుటుంబపోషణ భారమైంది. విషయం తెలుసుకున్న అసోసియేషన్ రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు గుత్తి మండల టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు అతడికి రూ.5 వేల నగదు, రూ.5 వేలు విలువ చేసే నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జాఫర్, లక్ష్మీనారాయణ, మురళి, లాల్‌శేఖర్, విజయ్, రామాంజనేయులు, విష్ణువర్ధన్, వలి, బాల పాల్గొన్నారు.

శింగనమల క్రాస్‌లో అన్నదానం

శింగనమల: మండలంలోని శింగనమల క్రాస్ వద్ద ఎన్‌హెచ్ 544–డీ రోడ్డు సమీపంలో రుష్యశృంగ మహాముని, శ్రీరంగరాయుల విగ్రహాల ఏర్పాటులో భాగంగా శనివారం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రుశ్యశృంగ మహాముని, శ్రీరంగరాయుల విగ్రహాల ఏర్పాటు నిర్వాహకులు రాంచరణ్, రమేష్, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్యుల సమ్మె

గార్లదిన్నె: రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యుల సమ్మెలో భాగంగా గార్లదిన్నె, యర్రగుంట్ల పీహెచ్‌సీ డాక్టర్లు సమ్మె చేస్తున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 20 శాతం ఇన్ సర్వీస్ కోటా అన్ని పీజీ క్లినికల్ బ్రాంచ్ కోర్సులకు వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వంతో తమ ప్రతినిధుల చర్చలు విఫలం కావడంతో సమ్మె కొనసాగిస్తామన్నారు.

పాఠశాలలో 'కళా ఉత్సవ్'



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఎంఈఓలు

పెద్దవడుగూరు: మండలంలోని పి.వీరన్నపల్లి జెడ్పీ పాఠశాలలో శనివారం మండల విద్యాశాఖ అధికారులు కళా ఉత్సవ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు కళల్లో కూడా రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులకు నృత్య పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'వీధి కుక్కల బెడద అరికట్టండి'

గుంతకల్లుటౌన్: పాత గుంతకల్లు నాగప్ప కాలనీలో వీధి కుక్కల బెడదను అరికట్టాలని క్షౌ రవృత్తిదారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కోశాధికారి బ్రహ్మ కోరారు. వీధికుక్కల నుంచి కాలనీవాసులను రక్షించాలని కోరుతూ శనివారం ఆ కాలనీవాసులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కుక్కకాటుకు గురై పలువురు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. చిన్నపిల్లల్ని బయటికి పంపాలంటే భయమేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు శివ, సురేంద్ర, అజయ్, మస్తాన్, మహిళలు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ వైద్యాధికారిగా ఇజీధాన్

యల్లనూరు: యల్లనూరు పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ వైద్యుడిగా ఇజీధాన్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ రెగ్యులర్ వైద్యుడు సమ్మెలో వెళ్లడంతో పేదలకు అందాల్సిన వైద్యసేవలకు అంతరాయం కల్గకుండా ఉండేందుకు కలెక్టర్ ఆనంద్ తాడిపత్రి ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఆయన్ను యల్లనూరు పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ వైద్యాధికారిగా నియమించారు. రెగ్యులర్ వైద్యులు వచ్చే వరకూ ఇజీధాన్ కొనసాగుతారు.

'యువత క్రీడల్లో రాణించాలి'

గుంతకల్లు రూరల్: యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్ సూచించారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కసాపురం రమేష్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. స్థానిక కసాపురం రోడ్డులోని మారుతీ నగర్‌లో నిర్వహిస్తున్న టోర్నీకి శనివారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొనకొండ్ల, వైటీ చెరువు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కొనకొండ్ల జట్టు 28 పరుగుల తేడాతో గెలుపొందింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గుంతలో బైక్ అదుపు తప్పడంతో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. గుత్తికి చెందిన రమణ, శ్రీధర్‌లు బైక్‌లో గుంతకల్లు రోడ్డు వైపు వెళుతుండగా.. అదుపు తప్పి వాహనం బోల్తా పడింది. ఘటనలో గాయపడిన వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

గుత్తి రూరల్: జీఎస్టీ తగ్గింపుపై మండలంలోని తొండపాడులో దుకాణదారులకు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ అవగాహన కల్పించారు. శనివారం రంగనాథ స్వామి ఆలయం ఎదుట ఉన్న కిరాణ దుకాణాలు, హోటళ్లు, కూల్ డ్రింక్స్ దుకాణాల వద్దకు వెళ్లి జీఎస్టీ తగ్గించడం ద్వారా ఏ వస్తువుల ధరలు తగ్గాయో ఎంపీడీఓ వివరించారు. ధరలు తగ్గిన వస్తువుల వివరాలతో ఉన్న కరపత్రాలను దుకాణదారులు, ప్రజలకు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ నూతన జీఎస్టీ విధానం వలన ధరలు తగ్గాయని దుకాణదారులు పాత ధరలతోనే వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈఓఆర్డీ నరసింహారెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

గార్లదిన్నె: మండలంలోని బూదేడులో గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం ఆదివారం ఆవిష్కరించనున్నారు. శనివారం గ్రామస్తులు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకున్నామన్నారు. కార్యక్రమానికి దళిత సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు.

క్లుప్తంగా

ఘనంగా మహబూబ్ సుభాని ఉరుసు



అలంకరణలో మహబూబ్ సుభాని దర్గా

గుంతకల్లు: స్థానిక సత్యనారాయణపేటలోని హజరత్ మహబూబ్ సుభానీ 54వ ఉరుసు ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున గంధ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశేష అలంకరణలో గంధాన్ని గుర్రంపై కొలువుదీర్చి మేళాతాళాల నడుమ ఊరేంగిచారు. అనంతరం దర్గాలోని సుభాని సమాధ వద్ద గంధాన్ని ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం అర్ధరాత్రి షంషీర్, జియారత్ కార్యక్రమాలతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయని దర్గా ఇన్‌చార్జ్ మహబుబ్‌బాషా, యూత్ కమిటీ సభ్యుడు జిలాన్ తదితరులు తెలిపారు.

దస్తగిరి స్వామి ఊరేగింపు



రామకోటికాలనీలో దస్తగిరి స్వామిని ఊరేగిస్తున్న ముస్లింలు

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో శనివారం గ్యార్మీ వేడుకల్లో భాగంగా దస్తగిరి స్వామి ప్రతిమను పురవీధుల్లో ఊరేగించారు. స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు నిర్వాహకుడు పక్రుద్దీన్ ప్రసాదాలతో పాటు విందు ఏర్పాటు చేశారు. ఏటా స్వామి వారి ఉరుసును నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆయన తెలిపారు. స్థానికులేగాక దూర ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి చక్కెర, బెల్లం చదివించడంతో పాటు వెండి గొడుగులను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మ్యాజిక్ డ్రైన్ పరిశీలన



డ్రైన్‌ను పరిశీలిస్తున్న షణ్ముఖ కుమార్

పామిడి: పట్టణంలోని నాయీ బ్రహ్మణ కాలనీలో ఉపాధి పథకం కింద చేపడుతున్న మ్యాజిక్ డ్రైన్ నిర్మాణాన్ని శనివారం ఉపాధి పథకం డైరెక్టర్ షణ్ముఖ కుమార్ పరిశీలించారు. రూ.61,640 అంచనా వ్యయంతో జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపడుతున్న ఈ డ్రైన్‌ను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కాంట్రాక్టర్లకు ఆయన సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ కే తేజోత్స్న, ఏపీఓ ఆదినారాయణమ్మ, ఈసీ, టెక్నికల్ అసిసెంట్లు, ఫీల్డ్ అసిసెంట్లు, జిల్లా ఉన్నతాధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

గుంతకల్లు రూరల్: వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని నెలగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కరీముల్లా మాట్లాడుతూ వన్యప్రాణులకు ఎట్టి పరిస్థితుల్లోనూ హాని తలపెట్టకూడదని సూచించారు. అనుకోని పరిస్థితుల్లో వన్యప్రాణులు ఎదురైనపుడు ఎలా మెలగాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు.

సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్ఈ సుధాకర్ రావు

పెద్దపప్పూరు: మండలంలోని పెద్దయక్కలూరు ఎస్సీ కాలనీని శనివారం హెచ్చెల్సీ అధికారులు సందర్శించారు. తమ కాలనీ చాగల్లు ప్రాజెక్టు దిగువ ఉండడంతో నీరు ఉబికి వస్తూ కాలనీలో మురుగు తాండవిస్తోందని, ప్రత్యామ్నాయ మార్గం చూపాలని ఇటీవల కాలనీవాసులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్ రావు, ఈఈ పార్థసారథి, డీఈ సూర్యనారాయణ ,జేఈ హరి కాలనీలో సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఉన్నతాధికారులను నివేదిక పంపుతామన్నారు. కార్యక్రమంలో అర్జీదారుడు పుల్లయ్య, ర్యాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కరిస్ట్) జిల్లా అధ్యక్షుడు వీర నాగరాజు పాల్గొన్నారు.

జీఆర్‌పీ ఎస్పీకి వీడ్కోలు



ఎస్పీ రాహుల్ మీనా దంపతులను సన్మానిస్తున్న జీఆర్‌పీ అధికారులు, సిబ్బంది

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే జిల్లా ఎస్పీ రాహుల్ మీనాకు సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. ఆయన అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు ఎస్పీగా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ప్రస్తుత విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. శనివారం స్థానిక జీఆర్‌పీ ఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసచారి నేతృత్వంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఎస్పీ రాహుల్ మీనా దంపతులను శాలవాలు, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్‌మీనా మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని జీఆర్‌పీ అధికారులు, సిబ్బంది సహకారం మరువలేనిదన్నారు. అంతకముందు ఓపెన్ టాప్ జీపులో ఎస్పీ దంపతులను ఊరేగించారు. కార్యక్రమంలో సీఐలు అజేయ్‌కుమార్, అరుణ్, సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

హంపన్నకు ఘన నివాళి



హంపన్న సమాధిపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని హంపన్న సమాధి వద్ద గుత్తి కోట పరిరక్షణ కమిటీ, హంపన్న అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం 132వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హంపన్న సమాధిపై పూలు చల్లి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్, సీపీఐ కార్యదర్శి రామదాసు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు. స్వాతంత్య్రం రాకముందు గూళపాళ్యం వద్ద హంపన్న రైల్వే గేటు కీపర్‌గా పని చేస్తున్న సమయంలో బ్రిటిష్ సిపాయిలు బారి నుంచి ఇద్దరు మహిళలను కాపాడారన్నారు. అలాంటి వ్యక్తిని మనందరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

పరామర్శ



చిన్నమట్లగొందిలో సంజీవులును పరామర్శిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: మండలంలోని చిన్నమట్లగొందిలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త సంజీవులును ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని కోరారు. ఆయన వెంట సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

త్వరగా కోలుకోవాలి



పేరం స్వర్ణలతను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

తాడిపత్రిటౌన్: పట్టణంలో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకురాలు రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలతను మాజీ ఎంపీ తలారి రంగయ్య, ఆయన తల్లి వెంకటమ్మ పరామర్శించారు. బ్రెయిన్ సంబంధిత సర్జరీ అనంతరం ఆమె గత కొద్ది కాలంగా తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందే. ధైర్యంగా ఉండలని, పార్టీ అండగా ఉంటుందని పేరం అమర్‌నాథ్‌రెడ్డికి తలారి రంగయ్య భరోసా ఇచ్చారు.

స్టార్టర్ పెట్టెలు, కేబుల్ చోరీ

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో రెండు విద్యుత్ స్టార్టర్ పెట్టెలు, కేబుల్ చోరీ చేశారు. బాధిత రైతు అమీర్ బాషా తెలిపిన వివరాల మేరకు.. చీనీ తోటకు నీరు అందించేందుకు రెండు బోర్ల వద్ద ఏర్పాటు చేసిన రెండు స్టార్టర్ పెట్టెలు, 46 మీటర్ల కేబుల్ గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో దాదాపు రూ.30 వేలు నష్టం జరిగినట్లు రైతు వాపోయాడు. ఈ మేరకు శనివారం గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.